ఫుడ్ ప్రాసెసింగ్ క్లస్టర్‌ను పరిశీలించిన కలెక్టర్



ఫుడ్ ప్రాసెసింగ్ క్లస్టర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

మేడ్చల్‌రూరల్: పూడూర్ గ్రామంలోని ఆదర్శ రైతు సేవా సహకార సంఘంలో పరిశ్రమల పునరుత్పత్తి పథకంలో భాగంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో(ఎంఎస్‌ఎంఈ) సహకారంతో ఏర్పాటు చేసిన ఫుడ్ ప్రాసెసింగ్ క్లస్టర్‌ను శనివారం జిల్లా కలెక్టర్ గౌతమ్ సందర్శించారు. క్లస్టర్‌లో కూరగాయలు, పండ్ల ప్రాసెసింగ్ యంత్రాల కొనుగోలు, ఇన్స్టాలేషన్ కోసం ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేడ్చల్ జిల్లాలోని మార్కెట్‌ల నుండి ఏటా సుమారు 190 టన్నుల కూరగాయలు, పండ్లు వ్యర్థమవుతున్నాయన్నారు. క్లస్టర్ల ఏర్పాటుతో వ్యర్థాన్ని అరికట్టి రైతులకు గిట్టుబాటు ధర కల్పించవచ్చని పేర్కొన్నారు. కూరగాయలు, పండ్ల ధరలు పడిపోయినప్పుడు ప్యాంకింగ్, సాస్, పౌడర్, చట్నీలను తయారు చేయడానికి ఉపయోగపడుతాయన్నారు. ఇందుకు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా మంత్రిత్వ శాఖ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి నీరజ గాంధీ, ఎంఎస్‌ఎమ్‌ఈ అధికారి సూర్యప్రకాశ్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఘనంగా వెంకటేశ్వరస్వామి రథోత్సవం



వెంకటాపూర్‌లో వేంకటేశ్వరస్వామి రథోత్సవం

ఘట్‌కేసర్: వెంకటాపూర్‌లో శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం అలివేలు మంగ సహిత శ్రీ బాలాజీ వెంకటేశ్వరస్వామి వారి రథోత్సం, శేష వాహన సేవ కన్నుల పండువగా జరిగింది. స్వామివారి దంపతులను అలంకరించి ప్రత్యేక వాహనంలో ఊరేగించారు. మహిళలు స్వామివారికి హారతులతో స్వాగతం పలికారు. ఊరేగింపులో సాంస్కతిక ప్రదర్శనలు అలరించాయి. ఊరేగింపులో ఆలయ కమిటీ చైర్మన్ వేణుగోపాల్ ముదిరాజ్, సభ్యులు నవీన్‌కుమార్ ముదిరాజ్, లింగం ముదిరాజ్, శంకర్ ముదిరాజ్, రామకష్టారెడ్డి, కళావతి, ఎంపీటీసీ రామారావు ముదిరాజ్, ఈవో భాగ్యలక్ష్మీ, మాజీ సర్పంచులు గీతాశ్రీనివాస్, బాల్‌రాజ్‌గౌడ్, మాజీ ఉపసర్పంచులు సత్యనారాయణగౌడ్, బాలరాజ్ ముదిరాజ్, శ్రీనివాస్ ముదిరాజ్, జంగయ్య ముదిరాజ్, వెంకటేశ్ గౌడ్, కుమార్ ముదిరాజ్, సత్తయ్య యాదవ్, భక్తులు పాల్గొన్నారు.

దంపతులకు డాక్టరేట్‌లు



డాక్టరేట్ అందుకుంటున్న యాదగిరి



డాక్టరేట్ అందుకుంటున్న శ్రీలక్ష్మి

- యాదగిరి, శ్రీలక్ష్మి దంపతులకు ఓయూ ప్రదానం
- శ్రీ లక్ష్మి గురుకుల డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు
- యాదగిరి ప్రభుత్వ పాఠశాల తెలుగు పండితుడు

ఘట్‌కేసర్: ఆ దంపతులు ఉన్నత విద్యావంతులు. ఇద్దరూ బోధనారంగంలో ఉన్నారు. వేర్వేరు సబ్జెక్టుల్లో పరిశోధనలు చేసి డాక్టరేట్లు సాధించారు. అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచారు ఘట్‌కేసర్ పట్టణానికి చెందిన యాదగిరి, శ్రీలక్ష్మి దంపతులు. వారికి ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్లు ప్రదానం చేసింది. శ్రీలక్ష్మి గురుకుల డిగ్రీ కళాశాల అధ్యాపకురాలుగా, యాదగిరి జెడ్పీ పాఠశాల తెలుగు పండితుడిగా పనిచేస్తున్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అర్జున్‌రావు కుతాడి పర్యవేక్షణలో 'ది రోల్ ఆఫ్ దళిత్ విమెన్-సోషల్ రిఫారమ్స్, సివిల్ సొసైటీ ఆర్గనైజేషన్స్ అండ్ తెలంగాణ మూవ్‌మెంట్'అనే అంశంపై చేసిన పరిశోధనకుగాను ఓయూ శ్రీలక్ష్మికి డాక్టరేట్ ప్రకటించింది. ఓయూ విశ్రాంత ప్రొఫెసర్ అన్నదానం వేంకట సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో 'భండారు సదాశివ రావు సాహిత్యం-సమగ్ర పరిశీలనం'అనే అంశంపై చేసిన పరిశోధనకుగాను యాదగిరికి డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్‌లు లావణ్య, ఇందిర, రమేశ్, కమలాకర్ శర్మ, విజయలక్ష్మీ, కాశీం, సూర్యధనుంజయ, రఘు అభినందించారు.

సమాన పరిహారం ఇవ్వాలి

ఉప్పల్: ఉప్పల్ ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా ఆస్తులు కోల్పోయిన భవన యజమానులందరికీ సమాన పరిహారం అందజేయాలని కోరుతూ ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం భవన యాజమానులు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఉప్పల్‌కు సంబంధించిన పలు అంశాలను వివరించారు. ఎలివేటెడ్ కారిడార్ పనులు వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కందికంటి అశోక్ కుమార్ గౌడ్, పూజల ప్రభాకర్, తిక్క ప్రకాశ్ పాల్గొన్నారు.

నిధుల్లేక.. పనుల్లేక..!



- గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు.. మరమ్మతులకు ఆటంకం
- పారిశుద్ధ్య కార్మికులకూ ... నెలనెలా అందని జీతాలు
- చేతులెత్తేసిన స్పెషల్ ఆఫీసర్లు.. ప్రజలకు తప్పని ఇబ్బందులు
- ఆగని అక్రమ నిర్మాణాలు... పన్నుల వసూళ్లలోనూ జాప్యం

సాక్షి,మేడ్చల్ జిల్లా: గ్రామపంచాయతీలు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. అభివృద్ధి పనులు, మరమ్మతులకు ఆటంకంగా మారుతోంది. సర్పంచుల పదవీకాలం ఈ ఏడాది ఫిబ్రవరి 2తో ముగిసిపోగా... నాలుగు నెలలుగా ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. వీరి పాలనకు ముందే పంచాయతీ ఖాతాలు ఖాళీ అయ్యాయి. సర్కారు నుంచి కొన్ని నెలలుగా నిధులు జమ కాకపోవటంతో పాలన మొక్కుబడిగా సాగుతోంది. రానున్న వర్షాకాలంలో నిధుల్లేక గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు పడకేస్తే ప్రజలు రోగాల బారిన పడే అవకాశముంది.

చేతులెత్తేసిన ప్రత్యేకాధికారులు

పారిశుద్ధ్య కార్మికుల జీతాలు, పైపుల లీకేజీకి మరమ్మతు, బోర్ల మరమ్మతు పనులు పంచాయతీ ట్రాక్టర్ నెలవారీ బ్యాంకు వాయిదా, గ్రామాల్లోలో విద్యుద్దీపాలు, నెలనెలా విద్యుత్ బకాయిలు.. ఇవ్వన్నీ కచ్చితంగా చెల్లించాల్సిందే. ఈ బరువు బాధ్యతల నుంచి ప్రత్యేక అధికారులు చేతులెత్తేసే తరహాలో ఉండటంతో గ్రామ కార్యదర్శులే భుజాన వేసుకొని ... కొట్టో, గొప్పో కార్మికులకు సగం సగం జీతం సర్దుబాటు చేస్తున్నట్లు ఓ గ్రామ కార్యదర్శి ఆవేదన వెలిబుచ్చారు. ఇప్పటికే కొన్ని గ్రామ పంచాయతీల్లో అప్పు చేసి ఖర్చు చేస్తున్నట్లు తెలుస్తోంది. నాలుగు రోజులు ఉండి పోయే వాళ్లమని ప్రత్యేక అధికారులు దాట వేస్తున్నారని పలువురు కార్యదర్శులు పేర్కొంటున్నారు.

ఖాతాలు ఖాళీ..

గ్రామ పంచాయతీకి మూడు రకాల ఖాతాలు ఉంటాయి. ఒకటి ఆస్తి పన్ను జమ చేసుకునే ఖాతా... గ్రామాల్లో ఆస్తి పన్ను వసూలు లక్ష్యానికి చేరుకొనకపోవటం.. ఖర్చులు మూడింతలు ఉండటంతో ఇది ఎప్పుడు ఖాళీగానే ఉంటుంది. రెండో ఖాతా ఎస్ఎఫ్సీ (స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్) ఇందులో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు జమ చేస్తారు. ఈ రెండు ఖాతాల్లో జమయ్యే మొత్తం ట్రెజరీ ద్వారా డ్రా చేయాల్సి ఉంటుంది. కానీ గత సర్కారు హయాంలో ఎస్ఎఫ్సీ నిధులు అరకొర మంజూరుతోనే సరిపెట్టింది. మూడో ఖాతా.. 15వ ఆర్థిక సంఘం నిధులు ఇందులో జమ అవుతాయి. కేంద్ర సర్కారు నేరుగా పంచాయతీలకు గ్రామ జనాభా ప్రాతిపదికన జమ చేస్తుంది. ప్రతి నాలుగు నెలలకోసారి వీటిని అందజేస్తోంది. కేవలం ఈ నిధులు మాత్రమే పంచాయతీలకు అందుతుండటం.. వీటిని ప్రత్యేక పనులకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. నిబంధనల మేరకు ఖర్చు చేయని నిధులు ఆయా ఖాతాల్లో మిగిలిపోగా మార్చిలో వాటిని రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకున్నట్లు తెలుస్తోంది.

పాలక వర్గం లేక...

గ్రామపంచాయతీల్లో ప్రజలకు సుపరిపాలన అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించినప్పటికీ, పరిస్థితి ఎక్కడేసిన గొంగడి అక్కడనే చందంగా ఉన్నాయి. పారిశుద్ధ్య కార్మికులకు నెలనెలా జీతాలు అందటం లేదు. పంచాయతీల్లో అవినీతి, అక్రమాలకు అడ్డుకట్టలేకుండా పోతోంది. ప్రభుత్వ, అసైన్డ్ భూములు, పార్కు స్థలాల్లో జోరుగా అక్రమ కట్టడాలు, లేఅవుట్లు కొనసాగుతున్నా... ప్రత్యేకాధికారులకు పట్టించుకోవటం లేదు. ఎన్నికల కోడ్ పేరుతో స్పెషల్ ఆఫీసర్లు విధులు నిర్వర్తించలేకపోతున్నారనే అపవాదును ఎదుర్కొంటున్నారు. పంచాయతీల్లో పన్నుల వసూళ్లలో కూడా సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తోంది. నిర్మాణాల అనుమతుల విషయంలోనూ ఉద్యోగులు అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు.

మొక్కుబడి కూల్చివేతలు

జెడ్పీలో అక్రమ కట్టడాలపై చర్చ నేపథ్యంలో జిల్లా పంచాయతీ శాఖ మొక్కుబడి కూల్చివేతలకు తెరలేపింది. ఘట్కేసర్ ఎంపీపీసహా పలువురు సభ్యులు అక్రమ కట్టడాలపై ఆధారాల ప్రతులను చైర్మన్‌సహా అధికారులకు అందజేశారు. దీంతో పంచాయతీ శాఖ కూల్చివేతలకు ఉపక్రమించింది. ఇప్పటి వరకు చీర్యాల, చౌదరిగూడ, బోమ్మరాసిపేట ,శామీర్‌పేట ఆరెంజ్ బౌల్ వద్ద అక్రమ కట్టడాలను కూల్చివేశారు. ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి ఫిర్యాదులు వస్తేనే పంచాయతీ శాఖ కూల్చివేతలకు దిగుతోంది. ఎన్నికల సమయంలో జీపీల్లో పదుల సంఖ్యలో ముఖ్యంగా ప్రభుత్వం, అసైన్డ్,పార్కుల స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టినా ...సిబ్బంది పట్టించుకోవటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

పురాతన ఆలయాలను పరిరక్షించుకోవాలి



చీర్యాల ఆంజనేయస్వామి దేవాలయం వద్ద నిర్వహించిన పూజల్లో పాల్గొన్న సునీతామహేందర్‌రెడ్డి

కీసర: గ్రామాల్లో పురాతన దేవాలయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మేడ్చల్-మల్కాజ్‌గిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం చీర్యాల గ్రామంలో గల పురాతన ఆంజనేయస్వామి దేవాలయం వద్ద నిర్వహించిన ప్రత్యేక పూజల్లో టీపీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణలతోకలిసి ఆమె పాల్గొన్నారు. దేవాలయ పున:నిర్మాణానికి సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నేతలు జయరాం, శివలింగాల శ్రీనివాస్, రామిడి శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఆఖరి గింజ వరకూ కొంటాం

డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ మధుకర్‌రెడ్డి



అలియాబాద్ సెంటర్‌ను పరిశీలిస్తున్న మధుకర్‌రెడ్డి

శామీర్‌పేట్: ఆఖరి గింజ వరకు కొనుగోలు చేస్తామని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి అన్నారు. శనివారం శామీర్‌పేట మండలం అలియాబాద్ సెంటర్‌ను ఆయన సందర్శించి ధాన్యాన్ని పరిశీలించారు. రైతులు అధైర్యపడవద్దని, వర్షాలు సమీపిస్తున్నందున కొనుగోలు కేంద్రాల వద్దకు త్వరగా చేర్చాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. డైరెక్టర్ నరేందర్‌రెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మర్పల్లిగూడలో ఉర్సు ఉత్సవం



మర్పల్లిగూడలో ఉర్సు ఊరేగింపు

ఘట్‌కేసర్: మర్పల్లిగూడలో శనివారం ఉర్సు ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉర్సు నిర్వాహకుడు ముస్తాఫా ఆధ్వర్యంలో డప్పు చప్పుళ్లు, యువకుల నృత్యాల మధ్యన జెండాకు ప్రత్యేక ప్రార్థనలు చేసి మజీద్ వరకు ఊరేగించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో లక్ష్మణ్, మాజీ ఉపసర్పంచ్ నరేశ్, శ్రీకాంత్, శివ, శంకర్‌కుమార్, జహంగీర్, షానూర్, అజీజ్, రషీద్, ఫయాజ్, ఇస్మాయిల్, ఉబేద్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న అక్రమ కట్టడాల కూల్చివేతలు



చౌదరిగూడలో అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న సిబ్బంది

ఘట్‌కేసర్: చౌదరిగూడలో అక్రమంగా నిర్మించిన పలు కట్టడాలను జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య సమక్షంలో కార్యదర్శి శశిధర్ శనివారం కూల్చివేయించారు. గ్రామంలోని జైపూరి కాలనీ, డాక్టర్స్ కాలనీ, రేణుక ఎల్లమ్మ కాలనీలో అనుమతి లేకుండా నిర్మించిన ఏడు కట్టడాలను కూల్చివేశారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి మాట్లాడుతూ అనుమతి లేని కట్టడాలను ఉపేక్షించేది లేదన్నారు. అక్రమాలు చేసిన వారు ఎంతటి వారైన వదిలేది లేదని హెచ్చరించారు.

లయన్స్ క్లబ్ కార్యవర్గం ఎన్నిక

ఉప్పల్: లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మీర్‌పేట ఎక్స్‌టెన్షన్ నూతన కార్యవర్గాన్ని శనివారం జిల్లా గవర్నర్ లయన్ వి.కృష్ణప్రసాద్ సమక్షంలో ఎన్నుకున్నారు. క్లబ్ అధ్యక్షుడిగా వికాస్, కార్యదర్శిగా శంకర్, కోశాధికారిగా మహిపాల్‌రెడ్డిని ఎన్నుకున్నారు. కార్యవర్గంతో పూర్వ గవర్నర్ బి.వెంకటేశ్, బి.రమేష్ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో కళ్యాణపురి కాలనీ వె వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, కాలనీవాసులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల సందర్శన



రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్

శామీర్‌పేట్: శామీర్‌పేట మండలంలోని అలియాబాద్, శామీర్‌పేట గ్రామల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం శామీర్‌పేట తహసీల్దార్ యాదగిరిరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లోని రికార్డులను పరిశీలించారు. రైతులకు గన్నీ బ్యాగుల కొరత లేకుండా చూడాలని, ధాన్యం కేంద్రానికి వచ్చిన వెంటనే తూకం వేయాలని సిబ్బంది సూచించారు. తేమ, పాట్లు తదితర అంశాలపై ప్రభుత్వ ఆదేశాలను పాటించాలన్నారు.



ఆర్థికసాయం చేస్తున్న సామల సందీప్‌రెడ్డి

వైద్య ఖర్చులకు ఆర్థికసాయం

పోచారం: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తులకు ఎస్‌వైఆర్ ఫౌండేషన్ ఆర్థిక సాయం చేసింది. పోచారంలో నిరుపేద కుటుంబానికి చెందిన శివరాత్రి లింగస్వామి పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి సామల సందీప్‌రెడ్డి ఈ విషయం తెలుసుకొని లింగస్వామి ఇంటికి వెళ్లి వైద్యం కోసం రూ. 20 వేల ఆర్థిక సాయం చేశారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఎస్.వెంకన్నకు రూ.10 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో పోచారం మున్సిపాలిటీకి చెందిన యువజన సంఘాల నాయకులు, ఎస్ఎస్ఆర్ టీం సభ్యులు పాల్గొన్నారు.

అక్రమ డొనేషన్లను అరికట్టాలి

మేడ్చల్: ప్రైవేటు ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ కళాశాలలో డొనేషన్ల పేరుతో అక్రమ వసూళ్లను ప్రభుత్వం వెంటనే అరికట్టాలని బీసీ సేన విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షుడు గోదా అరుణ్‌యాదవ్ డిమాండ్ చేశారు. మేనేజ్‌మెంట్, కన్వీనర్ కోటా సీట్లకు కళాశాలలు వారి స్థాయిని బట్టి రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు డొనేషన్‌ల పేరుతో వసూలు చేస్తున్నారని, ఉన్నత విద్యామండలి వెంటనే అరికట్టాలని ఒక ప్రకటనలో కోరారు. కళాశాలల్లో మేనేజ్‌మెంట్ సీట్లకు కౌన్సిలింగ్ పద్ధతిలో విద్యార్థులకు ఇవ్వాలన్నారు. పేద విద్యార్థులు రూ.లక్షల్లో డొనేషన్లు కట్టలేక చదువుకు దూరమయ్యే పరిస్థితి నెలకొంటుందని ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేస్తున్న కుతాడి శ్వేత

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ భూములైన సర్వే నెంబర్-474, 475, 476 లలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని జవహర్‌నగర్ కార్పొరేషన్ కో-ఆప్షన్ సభ్యురాలు కుతాడి శ్వేత శనివారం కాప్రా మండల తహసీల్దార్, జవహర్‌నగర్ కార్పొరేషన్ కమిషనర్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు, గోడౌన్స్, భవన నిర్మాణాలు నిర్మిస్తున్నారని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

సోషల్ మీడియాలో 'సేవ్ గవర్నమెంట్ ల్యాండ్స్'

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని ప్రభుత్వ భూములను కాపాడాలంటూ పలువురు సోషల్ మీడియాలో ప్రచారం మొదలు పెట్టారు. సేవ్ గవర్నమెంట్ ల్యాండ్స్, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, చేంజ్ ద పాలిటిక్స్, నాలాలు, కాల్వలు కాపాడుకుందాం, సేవ్ బోడుప్పల్ పేరిట ఫొటో కార్డులను ప్రదర్శించారు. మల్లాపూర్ రహదారిలో ఓ కట్టడం కూల్చారని, బంగారు మైసమ్మ దేవాలయం వద్ద ప్రభుత్వభూమిలో నిర్మాణం జోలికి వెళ్లలేదని, జ్యోతినగర్ కాల్వపై షెడ్డు, అల్మాస్ కుంటలో ఎఫ్‌టీఎల్ పరిధిలో కట్టడాన్ని తొలగించలేదని పేర్కొన్నారు. అయితే కొన్ని స్థలాల్లో రాజకీయకక్ష సాధింపుల్లో భాగంగా కూల్చివేతలు చేపట్టారని బోడుప్పల్ ముదిరాజ్ మత్స్యకార సంఘం ప్రతినిధులు ఆరోపించారు.

అప్పులు చేసి బెట్టింగ్.. తీర్చలేక ఉరేసుకొని..

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

అల్వాల్: అప్పులు చేసి బెట్టింగ్‌లకు పాల్పడి ఆర్థిక కష్టాల్లో కూరుకుపోయిన ఓ యువకుడి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్వాల్ ఇందిరానగర్‌లో నివసించే మహ్మద్ అబ్దుల్ వహీద్ (25) ఓ ప్రైవేట్ కంపెనీలో ల్యాండ్ సర్వేయర్. బెట్టింగ్‌లకు అలవాటు పడ్డాడు. పలు సంస్థల నుంచి లోన్‌లు తీసుకొని బెట్టింగ్ చేసి నష్టపోయాడు. అప్పులు తీర్చలేక మానసికంగా కుంగిపోయాడు. ఈ క్రమంలో ఈ నెల 24వ తేదీన రాత్రి ఇంట్లో కుటుంబసభ్యులతో కలిసి గడిపి తన గదిలో నిద్రపోయాడు. 25వ తేదీన ఉదయం అబ్దుల్ వహీద్‌ని నిద్రలేపడానికి తండ్రి ఎంత ప్రయత్నించినా ఉలుకూపలుకూలేదు. కిటికీలోంచి చూడగా అబ్దుల్ వహీద్ నైలాన్ వైర్‌తో ఉరేసుకున్నాడు. అక్కడ ఓ సూసైడ్ నోట్ లభించింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

షో కేస్..



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీలత చన్నాప్రగడ



కీసర: విద్యార్థులు సమ్మర్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలని పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీలత చన్నాప్రగడ అన్నారు. నెలరోజులుగా అహ్మద్‌గూడలోని పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్‌లో విద్యార్థులకు నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్ ముగింపు షో కేస్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. బాస్కెట్‌బాల్, స్కేటింగ్, ఫుట్‌బాల్, స్విమ్మింగ్ తదితర క్రీడల్లో నెలరోజుల పాటు శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.





సమ్మర్‌క్యాంప్‌లో భాగంగా విద్యార్థులు వివిధ క్రీడల్లో శిక్షణ తీసుకుంటున్న దృశ్యాలు